క్లుప్తంగా

పథకాలతో డ్వాక్రా సంఘాలకు వెలుగు

మధురపూడి: ప్రభుత్వ పథకాలతో డ్వాక్రా సంఘాలకు వెలుగు వచ్చిందని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎ.జయంత్‌రాజు అన్నారు. శనివారం కోరుకొండ మండలం గరగలంపాలెంలో డ్వాక్రా మహిళలకు గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేయూత పథకాలు ఆసరా నిలుస్తున్నాయన్నారు. మహిళలు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్వాక్రా సంఘ మహిళల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ బోడపాటి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి



బిక్కవోలు పాఠశాలను సందర్శించిన డీవైఈవో ఈవీవీఎస్ఎన్ నారాయణ

బిక్కవోలు: ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీవైఈవో ఈవీవీఎస్ఎన్ నారాయణ అన్నారు. శనివారం మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు ట్యాబ్‌లను ఎంతవరకూ ఉపయోగిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేల నగదు అందజేస్తున్న ఎంపీటీసీ లక్ష్మి

రంగంపేట: మండలంలోని దొడ్డిగుంట గ్రామానికి చెందిన పలివెల సత్యప్రకాష్ ఇటీవల మృతి చెందారు. అతనికి వైఎస్సార్ బీమా పథకంలో లక్ష రూపాయలు మంజూరయ్యాయి. దాంట్లో భాగంగా మట్టి ఖర్చులు నిమిత్తం వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా వచ్చిన రూ.10 వేలను సత్యప్రకాష్ కుటుంబ సభ్యులకు స్థానిక ఎంపీటీసీ మడికి లక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్ తోట వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ పంట వీరబాబు, కార్యదర్శి మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో మధుమేహం దూరం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యురాలు విజయలక్ష్మి

పెదపూడి: ప్రతి ఒక్కరూ విధిగా వ్యాయామం చేయడం ద్వారా మధుమేహ వ్యాధికి దూరంగా ఉంటారని జి.మామిడాడలోని ఆయుర్వేద వైద్యురాలు విజయలక్ష్మి తెలిపారు. జి.మామిడాడలో స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ హెల్త్ క్లబ్ ఆవరణలో శనివారం మధుమేహ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో వైద్యురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ అధిక ఒత్తిడి, సరైన ఆహార నియమాలు పాటించకపోవడం వల్ల మధుమేహ వ్యాధి విస్తరిస్తోందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కడిమి శ్రీనివాస్, క్లబ్ ప్రతినిధులు పప్పు రామకృష్ణారెడ్డి, చత్రపతి శివాజీ, మండ రాజారెడ్డి, డీవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బావాజీపేటలో హిందూ ధర్మ ప్రచారం



బావాజీపేటలో సనాతన ధర్మ ప్రచార రథానికి స్వాగతం పలుకున్న గ్రామస్తులు

గోకవరం: మండలంలోని బావాజీపేటలో శనివారం హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. సనాతన ధర్మ ప్రచార వాగ్గేయకార సంకీర్తన వాహిన సేవా సమితి ఆధ్వర్యంలో హిందూ ధర్మంపై ఇంటింటా ప్రచారం చేశారు. తొలుత గ్రామస్తులు, మహిళలు ప్రచార రథానికి గోవింద నామస్మరణ చేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. రాత్రి ఆలయం వద్ద ప్రచార రథం ప్రెసిడెంట్ కరటూరి వెంకట శ్రీనివాస్‌రావు బృందం సభ్యు లు అన్నమయ్య సంకీర్తన నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పౌష్టికాహారం.. పరమానందం

- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేత
- అవగాహన పెంచడానికే మాసోత్సవాలు

రాజానగరం: ఆరోగ్యంగా ఉన్నవారే నిజమైన ఆస్తిపరులని పెద్దలు అంటుంటారు.. అలాంటి సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవనానికి ప్రభుత్వం బాటలు వేస్తోంది. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలతో పాటు చిన్నారులకు పౌష్టికాహార లోపం రాకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నాయి. దీనిపై ఏటా వారోత్సవాలు/ మాసోత్సవాలు నిర్వహిస్తున్నాయి. స్థానికంగా లభించే వనరులతో పౌష్టికాహారం ఎలా పొందవచ్చో వివరిస్తున్నాయి. రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మూడు మండలాలు ఉన్నాయి. దీని పరిధిలోకి రాజానగరం మండలంలో 100, కడియం మండలంలో 82, రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 122 అంగన్‌వాడీ కేంద్రాలు వస్తాయి. ఈ కేంద్రాల పరిధిలో 2,903 మంది గర్భిణులు, 1,844 మంది బాలింతలు, 6,272 మంది చిన్నారులు ఉన్నారు. వీరికి ఆయా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు.

జాగ్రత్తలు చెబుతూ..

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ నెల రోజుల పాటు పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. స్థానికంగా లభించే వివిధ రకాల పదార్థాలతో పౌష్టికాహారాన్ని తయారు చేసి, వాటితో మండలాల వారీగా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కార్యకర్తలు, ఆయాలు ఇంటింటికీ వెళ్లి గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లు అందించడంతో పాటు కోవిడ్ నియంత్రణ పట్ల అవగాహన కల్పిస్తున్నారు. చిన్నారుల బరువు తూసి, ఎదుగుదలను చూస్తూ ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లులను చైతన్యపరిచే ప్రయత్నం చేస్తున్నారు.

ఇంట్లో లభించే పదార్థాలతో..

పౌష్టికాహారాన్ని ఇంట్లో లభించే పదార్థాలతో ఎలా తయారు చేసుకోవచ్చో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. జొన్న పిండితో లడ్డూలు, రాగి జావ, రాగి పిండితో జంతికలు, అటుకులతో పులిహోర, స్వీట్స్, బాలామృతంతో బిస్కెట్లు, ఇలా అనేక పదార్థాలను తయారు చేసుకోవచ్చని చెబుతున్నారు. అదేవిధంగా బియ్యం, పప్పు, వేరుశెనగ, గుళ్లసెనగ వంటి వాటితో జావగా తయారుచేసి ఆరు నెలలు దాటిన తరువాత పిల్లలకు అందించడం కూడా పౌష్టికాహారమే. వేరుశెనగ, బెల్లం, సోడి పిండి, అటుకులు, గుళ్ల శెనగ పప్పు, గోధుమలు తదితర వాటితో రకరకాల పదార్థాలను రుచికరంగా తయారు చేసుకుని, పౌష్టికాహారాన్ని పొందవచ్చంటున్నారు. కరివేపాకు, ములగాకు, బొప్పాయి, జామ వంటి వాటిలో ఉన్న పోషక విలువలపై అవగాహన కల్పిస్తున్నారు.



రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పౌష్టికాహార మాసోత్సవం (ఫైల్)

చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం



పౌష్టికాహార మాసోత్సవాల్లో మన ఇంట్లో లభించే వివిధ పదార్థాలతో పౌష్టికాహారాన్ని ఏవిధంగా తయారు చేసుకోవచ్చో తల్లులకు వివరిస్తున్నాం. రోగ నిరోధక శక్తి పెంపు, కుటుంబ నియంత్రణ, బిడ్డ పెరుగుదల, అనుబంధ ఆహారం, రక్తహీనత నివారణ, తల్లి పాల ప్రాముఖ్యత, ఆకుకూరల ప్రాధాన్యం, పరిశుభ్రత తదితర వాటిపై అవగాహన కలిగించి, సమాజంలో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

– టి.నాగమణి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు, రాజానగరం

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



పేదల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే పిల్లలతో పాటు బాలింతలు, గర్భిణుల ఆరోగ్యం కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లను అందజేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను కాన్వెంట్‌లుగా మారుస్తూ పిల్లలను కూడా బాగా ఆకట్టుకుంటున్నారు. అదేవిధంగా బొమ్మలతో ఆకట్టుకునేలా బోధిస్తున్నారు.

– పాలాటి అనూష, రాజానగరం

ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్



ఎయిర్‌పోర్టులో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

మధురపూడి: మధురపూడిలోని రాజమహేంద్రవరం విమానాశ్రయంలో శనివారం ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ మాక్‌డ్రిల్ నిర్వహించారు. అర్బన్ జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ మాక్‌డ్రిల్ సాగింది. తొలిసారిగా రిమోట్ ద్వారా రోబోట్‌ను ఉపయోగించి 20 నిమిషాల్లో డమ్మీ బాంబును డిటెక్ట్ చేయడం ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ మాట్లాడుతూ విమానయాన ప్రయాణికులు, సిబ్బందికి అవగాహన కల్పించడం కోసం ఈ మాక్‌డ్రిల్ నిర్వహించామన్నారు. ఏపీడీ జ్ఞానేశ్వరరావు, ఆర్ఐ (అడ్మిన్) యు.శ్రీనివాసరావు, ఏఆర్ ఎస్సై జి.సత్యబాబు, ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

సీతానగరం: మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్సై కె.చిరంజీవి శనివారం తెలిపారు. పదో తరగతి ఫెయిల్ అయిన ఆమె శుక్రవారం ప్రైవేట్ క్లాస్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లి, తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె తల్లి ఫిర్యాదు ఇచ్చిందన్నారు.

గణనాథుని దర్శించుకున్న ఎమ్మెల్యే



వడిశలేరు వినాయక మండపంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక పాతవూరు బాపనమ్మ అమ్మవారి ఆలయం వద్ద కొలువుతీర్చిన విజయగణపతిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాపనమ్మతల్లి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, బాపనమ్మ తల్లి యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రంగంపేట: గణపతి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా వడిశలేరులో ఏర్పాటుచేసిన గణపతి మండపంలోని వినాయకుడిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం దర్శించుకుని



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన భారీ అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్తి సత్తిబాబు, వార్డు సభ్యులు అడపా శ్రీనివాస్, పాల శివరామకృష్ణ, బత్తిన వరప్రసాద్, మణికంఠ పాల్గొన్నారు.

పందలపాకలో అన్న సమారాధన

బిక్కవోలు: గణపతి నవరాత్రుల్లో భాగంగా పందలపాకలోని సరిపల్లిపేట బాల గణపతి ఆలయం వద్ద దాతల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు శనివారం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు.

నేడు షిరిడీ సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు

అనపర్తి: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక ఐఎల్‌టీడీ వద్ద ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అనపర్తి ఆర్ష ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఉదయం ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం, లక్ష దూర్వార్చన తదితర పూజలు నిర్వహిస్తామన్నారు.

అలరించిన పాటల పోటీలు

మధురపూడి: గాడాల గ్రామంలో శ్రీవినాయక వెంకటసాయి ఆలయంలో శనివారం మహిళా భజన సంఘాల పాటల పోటీలు అలరించాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. మర్లావ, కాత్రావులపల్లి, కొండపల్లి, కొత్త వెలుగుబంద, వడిశలేరు గ్రామాలకు చెందిన మహిళా భజన సంఘాలు పాల్గొన్నాయి. అలాగే బూరుగుపూడి తదితర గ్రామాల్లోని వినాయక మండపాల్లో విశేష పూజలు జరిగాయి.

విజ్ఞాన యాత్రలు అవసరం



శ్రీహరికోటలో బీవీబీ విద్యార్థులు

రాజానగరం: విద్యార్థులకు చదువుతో పాటు విజ్ఞాన యాత్రలు ఎంతో అవసరమని నామవరంలోని భారతీయ విద్యాభవన్ (బీవీబీ) పాఠశాల ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్ అన్నారు. శ్రీహరికోటలోని భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)ను 85 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులతో కూడిన బృందం శుక్రవారం సందర్శించింది. వెహికల్ అసెంబ్లీ బిల్డింగ్, రాకెట్లను ప్రయోగించే ప్రదేశాలను అక్కడి పరిశోధకులు వారికి చూపించి, వాటి గురించి వివరించారు. అదే ప్రాంతంలో మ్యూజియాన్ని విద్యార్థులు సందర్శించారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్ శనివారం విలేకరులకు తెలిపారు.

పైప్‌లైన్ల సంరక్షణ సమష్టి బాధ్యత

మధురపూడి: ఐఓసీఎల్ పైప్‌లైన్ల సంరక్షణ సమష్టి బాధ్యతని ఐఓసీఎల్ మేనేజర్ పి.హనుమంతరావు అన్నారు. శనివారం కోరుకొండలో ఐఓసీఎల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఐఓసీఎల్ పైప్‌లైన్ల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పైప్‌లైన్‌పై ఎటువంటి తవ్వకాలు జరపరాదని, చెట్లు నాటరాదన్నారు. దీనివల్ల పైప్‌లైన్ పగిలే ప్రమాదం ఉందన్నారు. ఎటువంటి సంఘటనలు జరిగినా టోల్ ఫ్రీ నంబర్ 18004252159కు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం



కోరుకొండలో స్థానికులకు మొక్కలు పంపిణీ చేసిన ఐఓసీఎల్ అధికారులు

స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. పైప్‌లైన్ సంరక్షణకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ యూఎస్‌వీ సీతారామ్, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ



గుమ్మళ్లదొడ్డిలో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు నియోజకవర్గ స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చినట్టు హెచ్‌ఎం లక్ష్మీకాంతం, పీఎంసీ చైర్మన్ పి.చిన్ని తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో త్రోబాల్, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో 17 మంది విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు జగదీష్‌ని అభినందించారు.

వేంకటేశ్వరునికి విశేష పూజలు

పెదపూడి: సంపరలో వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఉదయం స్వామికి తులసి పూజ, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

డిజిటల్ చెల్లింపులు చేపట్టాలి

పెదపూడి: గ్రామ సచివాలయాల్లో మరింత పారదర్శకత కోసం అందరూ పక్కాగా డిజిటల్ చెల్లింపులు చేపట్టాలని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామ సచివాలయ కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ ఎంఎస్ఎన్ రెడ్డి, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాస్‌చౌదరి పాల్గొన్నారు.

సత్తా చాటిన విద్యార్థులు

రంగంపేట: అనపర్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఈలకొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–17 విభాగంలో దేవగుప్తపు నిషి పవన్ 200 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, షాట్‌పుట్‌లో తృతీయ స్థానం సాధించాడు. వాలీబాల్‌లో రమేష్, కబడ్డీలో భాను శంకర్ ఎంపికయ్యారు. అండర్–17 బాలికల విభాగంలో నాగమణి, గాయత్రి, సువర్ణలత ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో అనితాగ్రేస్ ఎంపికైంది. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో పాటు పీడీ వెంకటేశ్వర్లును పాఠశాల ప్రధానోధ్యాయుడు జి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

కానిస్టేబుళ్లు, పాత ముద్దాయి మధ్య ఘర్షణ

సీతానగరం: చీపురపల్లి పంచాయతీ పరిధి అచ్చియ్యపాలేనికి చెందిన సారా తయారీ కేసు పాత ముద్దాయి పీత పోశియ్య, ఎస్ఈబీ కానిస్టేబుళ్లు గౌస్, రవిల మధ్య ఘర్షణ తలెత్తింది. ఆ వివరాల్లోకి వెళ్తే... స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జి.సత్యనారాయణ ఆదేశాల మేరకు సారా సారా బట్టీ కేసులో విచారణ నిమిత్తం కోరుకొండ స్టేషన్‌కు రావాలని శనివారం పోశియ్యను కానిస్టేబుళ్లు కోరారు. తనకు ఎటువంటి సంబంధం లేదని పోశియ్య తిరస్కరించడంతో ఘర్షణ రేగింది. ఈ ఘటనలో గౌస్, పోశియ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. తర్వాత విచారణలో సారా బట్టీకి పోశియ్యకు సంబంధం లేదని తెలిసి వదిలిపెట్టామని సీఐ తెలిపారు.

ఘనంగా సామూహిక సీమంతాలు



కాటవరం అంగన్‌వాడీ సెంటర్‌లో సామూహిక సీమంతాలు

సీతానగరం: కాటవరంలోని అంగన్‌వాడీ సెంటర్–2లో హిందుస్థాన్ యూనీలివర్ లిమిటెడ్ కంపెనీ, అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు చేశారు. ప్రభాత్ పోషణ్ సాథీ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ప్రతి వారం స్థానిక పీహెచ్‌సీలకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సర్పంచ్ సత్యవేణి, ఉప సర్పంచ్ కోన రామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరా భారతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని కలసిన ఎమ్మెల్యే

అనపర్తి: తూర్పుగోదావరి జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పి.జగదీష్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఎస్పీకి పూలమొక్కను అందించి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. పార్టీ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ కొమరిపాలెం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డిలు ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.



ఎస్పీ జగదీష్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

ర్యాలీలకు అనుమతి లేదు

సీతానగరం: ర్యాలీలకు అనుమతి లేదని కోరుకొండ సీఐ ఉమా మహేశ్వరరావు తెలిపారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ శనివారం సీతానగరం వెలమపేట నుంచి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ సమాచారం అందుకున్న సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై కె.చిరంజీవిలు అక్కడికి వచ్చి ర్యాలీలకు అనుమతులు లేదని ఆ పార్టీ నాయకులకు చెప్పారు. దీంతో ర్యాలీని విరమించుకుని వారు నిరసన తెలిపారు.

ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు



ఎస్టీరాజాపురంలో లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేస్తున్న నాయకులు

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని సర్పంచ్ అడ్డాల పద్మ అన్నారు. ఎస్టీరాజాపురం గ్రామ సచివాలయం వద్ద 13 మందికి నూతనంగా మంజూరైన పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డాల వెంకటేష్, నల్లమోలు సత్యనారాయణ, పప్పు వెంకటేశ్వరరావు, బదిరెడ్డి ఈశ్వరరావు, దుర్గాప్రసాద్, దేవానందం తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పవిత్రతను కాపాడుకుందాం

కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి పవిత్రతను కాపాడుకునేందుకు, నదీ కాలుష్య నివారణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కమిషనర్ కె.దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నేతృత్వంలో చేపట్టిన స్వచ్ఛతాహి సేవ, ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 కార్యక్రమాల్లో భాగంగా శనివారం నగరంలోని ఘాట్‌లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, విద్యార్థులతో కలసి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే ఇటువంటి కార్యక్రమాలు విజయవంతం అవుతాయన్నారు. పవిత్ర గోదావరి నదిలో వ్యర్థాలు కలవకుండా ప్రజలే బాధ్యత వహించాలన్నారు. నది కలుషితం కాకుండా నగరపాలక సంస్థ అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. నేషనల్ రివర్ కన్జర్వేషన్ ప్రాజెక్టు కింద నిధులు పొందేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నామన్నారు. ఘాట్లను శుభ్రపరచే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను, సిబ్బందిని కమిషనర్ అభినందించారు. డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎ.వినూత్న తదితరులు పాల్గొన్నారు.



ఘాట్‌ను శుభ్రం చేసే పనుల్లో కమిషనర్ దినేష్‌కుమార్, ఉద్యోగులు